# దుష్ట సమాసం

చుట్టూరా ఉష్ణోగ్రతను వుసిగొలిపి, లోపల లక్షణంగా అత్తెసరు పెట్టినట్టున్న బస్సులోనుంచీ బయటపడ్డాను. చండమార్తాండుడు నిప్పులు గ్రక్కుతున్నాడు. గంట సరిగ్గా పన్నెండు.

బస్సు నిలిచిన చోటికి స్కూలు కూతవేటు దూరంలోనే వుంది. కానీ కుర్రాళ్ళందరూ స్కూలులోనే వున్నట్టు నేను భావించలేకపోయాను. కొందరు చెట్లకింద జేరి కొమ్మలు ఆధారంగా 'పులప్స్' తీస్తున్నారు. మరి కొందరు గోడల నీడల్లో తచ్చాడుతున్నారు. కొందరు కాలూ, చేయి జాడించుకుంటూ గ్రామాభిముఖులై వెళ్ళిపోతున్నారు.

అందరిలోనూ సాధువుగా కనిపించిన విద్యార్థి నొకణ్ణి దాపుకు పిలిచి "ఇదిగో అబ్బాయ్! ఇప్పుడు యింటర్వెల్లేమిటి?" అని ప్రశ్నించాను.

"ఇంటర్వెల్ ఎప్పుడో పోయింది. ఇది మూడో పీరియడు" అన్నాడా కుర్రాడు.

లోపల పాఠాలు జరుగుతుండగా వీళ్ళు బయట వెలగబెడుతున్న రాచకార్యా లేమిటో! నాకు కాస్త ఆశ్చర్యం కలిగింది. ఆశ్చర్యపడుతూనే మెట్లెక్కి వరాండాలో ప్రవేశించాను. వరాండాకు ఓ వైపున ఆఫీసురూములో ఏవో లెక్కలమధ్య కొట్టుమిట్టాడిపోతున్న గుమాస్తా "ఎవరండీ?" అని పలకరించాడు.

పరిచయం చేసుకున్నాను.

"కూచోండి, కూచోండి. ఇప్పుడే బస్సు దిగారేమిటి? ఇదిగో చెంచయ్యా! మేష్టరుగారికి ఓ గ్లాసు మంచినీళ్లు తెచ్చిపెట్టు" అంటూ అతడు వీలున్నంతలో ఉపచారా లుపచరించాడు.

కుర్చీలో కూర్చుంటూ "హెడ్మాస్టరు గారున్నారు గదండీ" అన్నాను.

"హెడ్మాస్టరుగారా? సార్! సార్! మీరే లోకంలో వున్నారు? అదిగో ఆ బోర్డు చూడండి" అన్నాడు గుమాస్తా.

ఆఫీసు గదికి అంతర్భాగంగా, గర్భగృహంలావున్న ఓ చిన్నగది ద్వారబంధానికి 'హెడ్‌మిస్ట్రెస్' అన్న బోర్డు వ్రేలాడుతోంది.

ముద్దార నేర్పిస్తే ముదితలు నేర్వగరాని విద్యలేనట్లే, బాధ్యత ఒప్పగిస్తే వాళ్ళు చేయలేని ఉద్యోగముకూడా లేదని నాకు తెలుసు. కానీ నడుస్తున్న బాట ప్రక్కన యితఃపూర్వం ఎన్నడూ వూహించని దృశ్యం కనిపించినప్పుడు, చదువుతున్న నవలలో యిదివరకు ఎక్కడా పొడసూపని పరిణామం సంఘటించినప్పుడు మనం కాస్త విభ్రాంతికి లోనుగావడం అసహజమేమీ గాదు. 'కలయో, వైష్ణవమాయయో' అన్నంత విభ్రాంతి గాకపోవచ్చు. కానీ ఆ బోర్డు వైపుచూస్తూ నేను నాలుగైదు క్షణాలపాటు కుర్చీలో కొయ్యబారిపోయినమాట మాత్రం నిజం!

"మంచినీళ్ళు తీసుకోండి సార్!" అన్న గుమాస్తా మాటలతో వులికిపడి, "అహఁ, అదికాదండీ! మరి....నాకిచ్చిన ఆర్డరులో హెడ్మాస్టరనే వుంది" అన్నాను.

"ఓహో, అదా! ఆ టైపిస్టుకు రేయింబవళ్ళు చేసినా తెమలనంత పని వుంటుంది. ఒక మానవుడు ఎంతకాలమని రాత్రుల్లో గూడా నిద్రపోకుండా పని చేయగలడు చెప్పండి? అందుచేత అతడు యిటు పనీ, అటు నిద్రా రెండూ ఒకసారిగానే నిర్వహిస్తుంటాడు."

పై ఆఫీసుకు సంబంధించిన పరమసత్యాలు ఈ గుమాస్తాకు బాగా విదితమైనట్లున్నాయి. అలాగే అక్కడ ఎవరినైనా కదిపితే యితడి బండారం బయట పడకపోదు. అందుకే కాబోలు, 'గొల్లలా గోత్రాలు గొర్రెలా కెరుక, గొర్రెలా గోత్రాలు గొల్లోళ్ళ కెరుక' అంటాడు ఆసాది వాడు!

గవాక్షాల్లోనుంచీ చల్లటిగాలి వీస్తోంది. పై కప్పునుంచీ మొదలుబెట్టి గోడలపైన వ్రేలాడుతున్న కాలెండర్లనీ, పాత హెడ్మాస్టరుల ఛాయా చిత్రాల్ని చూడసాగాను. ఉన్నట్టుండి చూపు కుర్చీకి దగ్గరగా వ్రేలాడుతున్న గ్రూప్ ఫోటో పైన ఆగింది. పై వరుసల్లో విద్యార్థులు నిల్చున్నారు. క్రింద విద్యార్థినులు కూచున్నారు. మధ్యగా కుర్చీలో కూర్చున్న ఉపాధ్యాయవర్గానికి నట్టనడుమ హెడ్‌మిస్ట్రెస్ ఆసీనురాలైంది. ఆకారాన్ని గురించి ఓ అభిప్రాయం కలిగీ కలగముందే ఆమె పేరు తెలుసుకోవాలన్న ఆసక్తి నాకెందుకు కలగాలో చెప్పలేను. బహుశా అందుకిది కారణమైతే కావచ్చు. ఒకప్పుడు పేరు మాత్రమే మొదట విని, ఆ తరువాత ఎప్పుడో మనం మనిషిని కలుసుకోవడం తటస్థిస్తుంది. మరొకప్పుడు మనిషిని చూచిన తర్వాత కొంత కాలానికిగానీ, మనకు పేరు తెలియకపోవడం జరుగుతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ నామరూపాలు ఒక దానికొకటి పొసగక పోవడంచేత మన అంచనాలు తరచు వీగిపోవడం కద్దు. ఇందుకొక్క తరణోపాయం మాత్రం కనిపిస్తుంది. పేరుతోబాటే ఆకారాన్ని, ఆకారంతోబాటే అభిధేయాన్నీ, రెంటినీ ఒక్కసారిగా తెలుసుకోడమే ఆ వుపాయం!

ఫొటో క్రింద ముద్రింపబడిన పేర్ల జాబితాతో హెడ్‌మిస్ట్రెస్‌గారి పేరును యిట్టే గుర్తుపట్టేశాను.

ఆమె పేరు ప్రమీలాదేవి.

వయస్సు ముప్పై ఐదుకు తక్కువుండదు. ఫోటో కోసంపెట్టిన ఫోజులో ఆమె కుర్చీలో తీర్చిదిద్దిన శిల్పంలావుంది. పొడుగరి కాదు. పైగా పొట్టి అని చెప్పడానికి గూడా వీలుంది. కానీ ఆమె స్థూలశరీర మాత్రం కాదు. ఔచిత్యం జారిపోని వేషధారణ. విప్పారిన నెమలి ఫించంలాంటి కబరీభరం ఆ ఆకృతికి గాంభీర్యాన్ని ప్రసాదిస్తున్నాయి. కర్ణభూషణాలు వెదజల్లుతున్న వెలుగులు. మెడలోని మామిడి పిందెల దండ చిమ్ముతున్న మెరుగులు, ఆమె పలుచని పెదవుల పైనుంచి ప్రసారమవుతున్న మంద హాస్యద్యుతులతో కలిసిపోతున్నాయి.

ఒక్కొక్క రకమైన వుద్యోగానికీ ఒక్కొక్క రకమైన విగ్రహమూ, అందుకు తగిన హావభావాలు అవసరం. సబ్‌యిన్స్పెక్టరు గిరీ అవలీలగా

చలాయించగలిగిన దృఢకాయుడు పంచకట్టుతో జుబ్బాతో అంగవస్త్రాన్ని సరి చేసుకుంటూ తరగతి గదిలో ప్రవేశిస్తే కుర్రాళ్ళు గొల్లున నవ్వేసినా నవ్వేయ గలరు. వ్యాపారాలకు శ్రేడుమార్కుల్లా ఉపాధ్యాయవృత్తికి సముచితంగా గుర్తింపబడిన ఆకారాలు కొన్ని వున్నాయి. సన్నగా, పొడుగ్గా, తోటకూర కాడలాంటి స్వరూపం ఒకటి. పొట్టిగా, గుమ్మటంలాంటి ఆకారం మరో కటి. ఇక ప్రధానోపాధ్యాయుడన్న ప్రసక్తిరాగానే పొడుగాటి కోటు, బుర్ర మీసాలు, మందరగిరిని చుట్టుకున్న వాసుకిలా నడుముకు రెండంగుళాల వెడల్పుతో బెల్టు, యిలాటి హంగులతో గదా, మహిషము చెంతలేని యమ ధర్మరాజు విగ్రహం మదిలో మెదలుతుంది. సమవర్తి సింహాసనం ఓ నాలుపోగు ఆధారంతో, అగ్నిగుండంపైన వ్రేలాడుతుంటుందని చెబుతారు. కుర్రాళ్ల రేపే కల్లోలాలు, ఉపాధ్యాయులమూలంగా వుప్పతిల్లే చెచ్చెరువులు, స్థానిక ప్రముఖుల హోదాలు, పై అధికారుల శాసనాలు మున్నగువాటి దృష్ట్యా హైస్కూలు హెడ్మాస్టరుగారి స్థానం అంతకన్నా భద్రమైందిగా తోచదు. ఎంతగా ప్రయత్నించినా ప్రమీలాదేవిని ఆ పీఠంపైన కూచున్నట్టుగా వూహించుకోడం నామట్టుకు నాకు అసమంజసంగానే భాపించింది.

ద్వారం దగ్గరనుంచీ పాదరక్షల చప్పుడు వినిపించింది. వెనుదిరిగి చూచేసరికి చుక్కలు చుక్కలుగా వదనమండలమంతటా క్రమ్ముకుంటున్న చెమటను చేతిగుడ్డతో తుడుచుకుంటూ ప్రమీలాదేవి లోపలికి వచ్చేస్తోంది.

"ఈయనేనండీ మన కొత్త టీచరు కృష్ణమూర్తిగారు" అన్నాడు గుమాస్తా.

"నమస్తే సార్!" అంటూ చేతులు జోడించాను.

హెడ్‌మిస్ట్రెస్ ప్రమీలాదేవి హేలగా నవ్వుతూ "సార్ అనగూడ దండీ! మేడమ్ అనాలి" అనేంతవరకూ నా పొరబాటు నాకు తెలిసిందిగాదు.

"రండి, కూచుందురుగానీ" అంటూ ప్రమీలాదేవి గదిలోపలికి దారితీసింది. అది చాలా చిన్నగది. బీరువాల లోపలా, పైన, ఆ తరువాత చెక్కలపైనించి పైకప్పుదాకా దొంతరలు దొంతరలుగా ఆనిపోయివున్న పాతకాగితాలు తప్పితే మరేమీ కనిపించని ఆ గదిలో ప్రమీలాదేవి తన కుర్చీలో తను కూర్చుంటూ, నాకో కుర్చీ చూపించింది.

ఐదారు నిమిషాలు నీరసంగా దొర్లిపోయాయి. అర్జెంటు పేపర్ల పైన సంతకాలు ముగించి, ప్రమీలాదేవి తలపైకెత్తేవరికి నేను ఆ గదిలోపలి వాతావరణంలో గిలగిలలాడిపోతున్నాను.

"ఈ దుర్వాసన నాకైతే అలవాటయిపోయింది. కొత్తవారు గనుక మీకు కాస్త యిబ్బందిగానే వుండవచ్చు" అంది ప్రమీలాదేవి.

"పెద్దపెద్ద ఆఫీసుల్లో పాతబడి, నిరుపయోగమైపోయిన కాగితాలను సంవత్సరాని కొకసారి కాల్చేస్తారని విన్నాను" అని ఓ వుపాయాన్ని సూచించబోయాను.

"అకామిడేషన్ చాలడంలేదని వెయ్యిసార్లు విన్నవించుకోవడం జరిగింది. అఖరుకు అరునెలల క్రిందట ఓ బ్లాకు నిర్మాణానికి డబ్బు మంజూరు చేశారు. ఈపాటికి ప్లాను సిద్ధమైవుంటే, పైనెల్లో పనిగూడా ప్రారంభం కావచ్చు. కానీ కృష్ణమూర్తిగారూ! ఇక్కడ మన పనికి ఈ కాగితాలొక్కటేనా ప్రతిబంధకం?"

"నేనీ ప్రాంతానికేగాక, ఉద్యోగానికిగూడా కొత్తవాణ్ణి మేడమ్! అన్ని విషయాలూ మీరే చెప్పాలి" అన్నాను.

ప్రమీలాదేవి బరువుగా నిట్టూర్చింది. "ఏం చెప్పమంటారు! ఉద్యోగ రీత్యా నేనీ వూరికి వచ్చి ఆరేళ్లు గడిచిపోయి యిప్పుడు ఏడో సంవత్సరం జరుగుతోంది. ఈ ఏడేళ్ళలో నాకొక్కరోజుగూడా నిశ్చింతగా గడవలేదంటే బహుశా మీరు నమ్మరేమో!"

హెడ్‌మిస్ట్రెస్‌లో నేను అధికార ధోరణిని మాత్రమే యెదురు చూచాను. కానీ అందుకు వ్యతిరిక్తంగా పరిచయమై యింకా పదినిమిషాలు గాకముందే తన కష్టనష్టాలు వెళ్ళబోసుకుంటున్న ప్రమీలాదేవి, నాకెంతో కాలంనుంచీ పరిచితురాలైన ఆప్తబాంధవిలా గోచరించింది. నిస్సహాయత ధ్వనిస్తున్న ఆ ముఖాన్ని చూస్తున్నకొద్దీ ఒకానొక విషాదగాథలో పీఠికా ప్రాయమైన ప్రథమాధ్యాయాన్ని చదువుతున్నట్టుగా నా మానసాకాశమంతటా ఓ విచిత్రానుభూతి అలుముకుపోయింది.

"ఇది విద్యాలయం! అవునుగదండీ! ఇక్కడ కుర్రాళ్లు చదువుకుంటారనీ, సిలబస్ మేరకు పాఠాలు చెప్పడంతో మన కర్తవ్యం తీరి

పోతుందనీ మీరనుకుంటున్నారు. నేనూ అలాగే అనుకునేదాన్ని. కానీ ఈ పది పదిహేనేళ్ళ అనుభవంలో నేను ఆ అభిప్రాయాన్ని మార్చుకోవలసి వచ్చింది. ఎందుకంటారా....''

ఎందుకో తెలుసుకోవాలన్న ఆసక్తితో నేను సావధానంగా కూర్చున్నాను. కానీ ప్రమీలాదేవి అంతలోనే తన వుద్దేశం మార్చుకుని ''పోనివ్వండి. ఇప్పుడా గొడవెందుకు? మీరు ఉదయం ఎనిమిదిగంటలకెప్పుడో బస్సెక్కి వుంటారు. ఉండండి. ఫ్లాస్కులో కాఫీ వుందేమో చూస్తాను'' అంటూ లేచింది.

మనిషిని ఒక తోలుతిత్తితో వుపమిస్తే. ఆ తిత్తిలోపలికి జీవనోత్సాహమన్న గాలిని పూరించే పానీయ విశేషం కాఫీ! ఆ పరిస్థితిలో నాకు కాఫీ అత్యవసరమే! ఫ్లాస్కులోనించీ కాఫీని గ్లాసులోకి వంచుతూ ''మీ అదృష్టం మంచిది. మా మురళి యింకా స్కూలునుంచీ వచ్చాడుకాదు. ఇంటిదగ్గరనుంచి తెచ్చుకున్న కాఫీ అలాగే వుండిపోయింది'' అంది ప్రమీలాదేవి,

నేనావిడ ప్రసంగ ధోరణికి అడ్డుపడ దలచుకోలేదు గనుక మౌనంగానే కూర్చున్నాను.

''అన్నట్టు మా మురళి మీతో నేస్తం కట్టేస్తాడనుకుంటాను— క్రొత్తగా వచ్చిన ప్రతి టీచరుకూ ఎన్ని పాటలు వచ్చునో, ఎన్ని కథలు వచ్చునో పరీక్షించడం వాడి వాడుక. మీ బొక్కసంలో పాటలూ, కథలూ ఖాళీ అయిపోయేంతవరకూ వాడు మిమ్మల్ని వదలిపెట్టడు....''

''పాటలకు నాకూ చాలాదూరం మేడమ్! కానీ ఎన్ని రోజులు చెప్పినా ఎడతెగని కథలుమాత్రం నాకు కొన్ని తెలుసు'' అన్నాను.

''కానీ మా మురళి అసాధ్యుడండోయ్! వాడితో వేగడం చాలా కష్టం. మళ్ళీ మా సుశీల వుంది చూచారూ. వెర్రిబాగులపిల్ల. అది నోరు విప్పడమే బ్రహ్మాండం—అదిగో, పిల్లలొచ్చేస్తున్నారు....చూడండి,కృష్ణమూర్తీ! వాడు సుశీలనెలా చిదక బాదేస్తున్నాడో! దొంగ వెధవ,

రానివ్వండి, వాడి పని చెబుతాను........" ప్రమీలాదేవి చరచరా వెళ్ళి కిటికీ దగ్గర నిల్చుంది.

మురళి తారచువ్వలా వచ్చిపడ్డాడు. రాగానే భుజానికి తగిలించుకున్న పుస్తకాల సంచిని తీసి నేలపైకి విసిరి, తల్లి పాదాలకు చుట్టుకుంటూ "చూడమ్మా మరి, రాత్రి నేను చదువుకోలేదని అక్కయ్య మేష్టరుగారితో చెప్పేసింది. మేష్టరుగారు చేయి చాపమని పేం బెత్తంతో రెండు దెబ్బ లంటించేశారు" అంటూ ఏడుపు లంకించుకున్నాడు.

"అలాగా! నీపైన చాడీలు చెప్పడమే! ఉండు, దానిపని చెబుతాను" అంటూ ప్రమీలాదేవి కుర్రాణ్ణి చేతుల్లోకి తీసుకుని వూరడింపసాగింది.

"నే నెక్కడ చాడీలు చెప్పానమ్మా!" తక్కుతూ, తారుతూ ద్వారం దాకా వచ్చిన సుశీల అక్కడే నిల్చుని బెదరుచూపులతో తల్లివైపు చూస్తూ అంది: "రాత్రి మురళి చదువుకున్నా దేమిటి?"

"చదువుకోకపోతే మాత్రం? నిన్నా విషయం తీసుకెళ్ళి మేష్టరు గారితో చెప్పేయమన్నారేమిటి?" చిరుకోపంతో కుమార్తెను చురచుర చూచింది ప్రమీలాదేవి.

మాతృ హృదయం తప్పొప్పుల తారతమ్యాన్ని అంతగా పట్టిం చుకోదేమో ననిపించింది నాకు!

ప్రమీలాదేవి సూచించినట్టుగా అయిదు నిమిషాలు గడచీ గడవక ముందే మురళి నాతో జతకట్టేశాడు. నా జేబులోని పేనా, చేతికున్న గడి యారమూ, అంతలోనే వాడికి చిరపరిచితాలైపోయాయి. ఇంకొక అర గంటలో నన్నొక కథ చెప్పమని పీడించడానికి కావలసినంత చనువును వాడు క్షణక్షణానికీ ప్రోది చేసుకుంటున్నాడు!

ఆఖరుకు వుదయం బయల్దేరింది మొదలు, ఆ క్షణందాకా నన్నేదు ర్కొంటున్న సమస్యనుగూడా ఆ కుర్రవాడే పరిష్కారం చేశాడు. గంట మ్రోగింది. హెడ్‌మిస్ట్రెస్‌ద్వారా ఒక్కొక్కరే నన్ను పరిచయం చేసుకుని అధ్యాపకులుగూడా యిళ్ళకు వెళ్ళిపోయారు. ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడికి కలి

గిన ధర్మసందేహం వాళ్ళ కెందుకు కలగలేదన్న విషయం నా కప్పటికీ, యిప్పటికీ అనూహ్యంగానే వుండిపోయింది. అందరూ వెళ్ళిపోయిన తర్వాత యింటికి సాగబారుతున్న తల్లి చేతిని పట్టుకుని "మేష్టరుగారెక్కడ భోజనం చేస్తారమ్మా?" అన్నాడు మురళి.

"చేస్తే చేస్తారు. లేకపోతే వూరుకుంటారు. నీకేం?" అంది ప్రమీలాదేవి.

"మరి, ఈ వూళ్ళో మంచి హోటళ్లుకూడా లేవుగా!" అమాయికంగా తల్లి కళ్ళల్లోకి చూచాడు మురళి.

బిడ్డల మంచితనం లోకానికి వ్యక్తమౌతున్నప్పుడు తల్లికి అమందానందం కలగడం సహజమే! ప్రమీలాదేవి సగర్వంగా నా వైపు చూచింది.

కుర్రాడి ప్రతిపాదనను తల్లి ఏకగ్రీవంగా బలపరచడంవల్లనైతే నేమి. గత్యంతరం లేకపోవడంవల్లనైతే నేమి, నేనా అతిథ్యాన్ని స్వీకరింపక తప్పిందిగాదు. మండుటెండలో తల వంచుకుని నేను ప్రమీలాదేవిని వెంబడించాను. భోజన సదుపాయం కల్పించడంలో తృప్తిపడక నాకు కాస్తా వినోదాన్ని సైతం సమకూర్చదలచుకున్నాడేమో, అందాకా వెనుకబడిపోయి సుశీలతో మంతనాలు జరుపుతున్నవాడు, ఒక్క పరుగుతో ముందుకువచ్చి "అమ్మా! అమ్మా! అక్కయ్య మేష్టరుగారిని కూడా పుష్పపల్లకికి తీసుకెళ్దామంటోంది" అన్నాడు మురళి.

"అబ్బే, నేననలేదు. వాడే తీసికెళ్దామని నాతో చెప్పాడు" అంది సిగ్గుపడిపోతూ సుశీల.

"నేను చెప్పానుగదండీ! మా వాడింక ఒక క్షణంకూడా మిమ్మల్ని వదలిపెట్టడు" అంది ప్రమీలాదేవి.

తల్లీ బిడ్డల నాటకంలో నా మూగపాత్రను చాలించుకుని "పుష్పపల్లకి ఎక్కడండీ?" అని ప్రశ్నించాను.

"ఇక్కడే లెండి. జట్కాలో వెళ్తే ఓ గంటసేపు ప్రయాణం. ఈ

ప్రాంతానికంతా అదొక పెద్ద వేడుక. పోయిన సంవత్సరం వెళ్లొచ్చాము. ఈసారికూడా వెళ్ళాలని వీళ్లు నా ప్రాణం తీసేస్తున్నారు."

"అదిగోనండీ మేష్టరుగారూ! అదే మా యిల్లు. అదే, అదే" అన్నాడు మురళి.

★ ★ ★

ఫిరంగిపురం ఉప్పునీళ్ళ పుణ్యమా అని సాయంత్రానికల్లా రొమ్ము పడిశం ముమ్మరంగా పట్టింది. గొంతుక కరకర రాచుకుంటూ, పొడి పొడిగా బయట పడుతున్న దగ్గుతో సతమతమవుతూ వరండాలో వేసుకున్న మంచంపైన పడుకుని చిమ్మ చీకటిలోకి చూస్తూ కాల హరణం చేయసాగాను. అకల్లాడని నీరవ నిశ్శబ్దంలో నిశీధ రాజ్ఞి తన సామ్రాజ్యంలో కాలుమోపిన నన్ను సన్మానించడం కోసం చీకటీగలతో పాటకచ్చేరీ ఏర్పాటు చేసింది. తలపోటుతో బీటలు వారి పోతున్న చెవి గూబలకు చేతి గడియారం టిక్ టిక్‌మంటూ నడుస్తున్న ధ్వనిగూడా సమ్మెటప్రేటులా వినిపిస్తోంది. 'జన్మకల్లా శివరాత్రి' అన్నారు. ఆ శివరాత్రి నాడీవిధంగా సాక్షాత్కరింపగలదని మాత్రం నేనెన్నడూ అనుకోలేదు.

అంధకారంలో మిలమిల మెరుస్తున్న తారకలను చూస్తున్న కొద్దీ నాకు ప్రమీలాదేవి ఆతిథ్యం జ్ఞప్తికి రాసాగింది. అవిడ ఆదరమే గనుక లభ్యంగాకపోయి వుంటే నాపాలిటికి ఫిరంగిపురం చీకటి గుయ్యారంగా తోచివుండేదేమో!

తెలిసినంతవరకే చాలునని వూరుకోక, మరికొంత స్వకపోల కల్పన సాగించి ఎదుటి వ్యక్తిపట్ల లేని పోని ఊహాపోహలు కల్పించుకోడం మానవుడి చిత్తప్రవృత్తిలోని దౌర్బల్యాల్లో మొట్టమొదటిది. కాకపోతే ప్రమీలాదేవిని కేవలం సౌజన్యమూర్తిగా భావించడంతో ఆగిపోక, ఆమెను గురించి నా అంతరాంతరాల్లో వెయ్యి ప్రశ్న లెందుకు చెలరేగాలి? ఆమె దేవూరు? ఆమెకు బంధువులు లేరా? ఉంటే వాళ్ళెక్కడున్నారు? అన్నింటి

కన్నా ముఖ్యమైంది—ఈమెను సహధర్మిణిగా బడసిన అదృష్టవంతు డెవడు?....

ఏ వైపునుంచోగానీ ఓ గాలి రివ్వునవచ్చి పరిసర తరువుల్ని గిలిగింతలు పెట్టడంతో కాస్తా వూపిరి త్రిప్పుకోడానికి వీలయింది. గడియారం చూచుకున్నాను. గంట పదకొండు కావస్తోంది. నిద్రపోదలచుకుంటే యింతకంటే మంచి తరుణం దొరకదు. ఎక్కడి ఆలోచనలను అక్కడే వదలిపెట్టి, గట్టిగా కళ్ళు మూసుకున్నాను....

ఒకటి.... రెండు... మూడు- నిండుగా అయిదు నిమిషాలుగూడా గడచి వుండవు. పై కప్పు విరిగి తలపైన పడినట్టుగా ఓ శబ్దం వినిపించింది. ఉలికిపడి, లేచి మంచంపైన కూచున్నాను. ఉండినా ఒకటే, వూడినా ఒకటే అన్నంత విసురుతో ఎవరో తలుపును దబదబ బాదేస్తున్నారు.

"ఎవరక్కడ?" తీవ్రంగా ప్రశ్నించాను.

"నువ్వెవరు?" అవతలి వ్యక్తి నాకంటే వెయ్యిరెట్లు కర్కశంగా ప్రశ్నించాడు. తన గుహ ముందర అడుగు జాడల్ని పసిగట్టిన సింహం అలా ప్రశ్నించి వుంటుంది.

నేను సైతం మేకపోతు గాంభీర్యాన్ని విడిచి పెట్టదలచుకోలేదు.

"మీ రలాగే తలుపును బాదదలచుకుంటే నా ఆక్షేపణేమీ లేదు. కానీ కాస్తా తమాయించుకుని పరిశీలించినట్టయితే తలుపు తాళం వేయబడివుందని మీరు గ్రహించగలరు" అన్నాను.

"తాళం చెవెక్కడ?"

ఒకానొక పిండారి దొంగలనాయకుడు యింటి యజమానుణ్ణి అలా ప్రశ్నించి వుంటాడు!

ఓరి, వీడి తెంపరితనం కాలిపోనూ! వీడు యింటిలోవాళ్ల ఏమయ్యారని అడగడు. ఎక్కడికి పోయారని అడగడు. తలుపుకు తాళం వేశారని తెలియగానే తాళంచెవికోసం మాత్రం 'డిమాండ్' చేయగలడు!

అతడిపట్ల నాకు సదభిప్రాయం కలుగలేదు. అందుచేత అతడికి తాళం చెవి యివ్వడమన్న ప్రసక్తి లేనేలేదు.

మళ్ళీ పడుకోడానికోసం పడకను సర్దుకుంటూ "మొదట మీరెవ్వరో తెలుసుకోనివ్వండి" అన్నాను.

అతడు జేబులోనుంచీ అగ్గిపెట్టె తీశాడు. చరాలున ఓ పుల్లనుగీసి వెలిగించాడు. రెండడుగులు ముందుకువేసి వెలుగుతున్న అగ్గిపుల్లను నా ముఖం దగ్గరికి తెచ్చేశాడు.

ఆ అగ్గిపుల్ల నాలుగైదుక్షణాలు మాత్రం వెలిగి వుంటుంది. ఆ స్వల్ప వ్యవధిలోనే అతడి వాలకం నన్ను హడలగొట్టేసింది. అతడు తనలాంటి మనుషులు యిద్దరు ముగ్గురు సులభంగా దూరిపోడానికి వీలున్నంత వదులొదులుగావున్న సిల్కుపైజమా వేసుకున్నాడు. మోకాళ్ళదాకా వ్రేలాడుతూ క్రింద అంచులదగ్గర చేటల్లా రెపరెప లాడుతున్న జుబ్బా తొడుక్కున్నాడు. మెడకు రెండు మూడు చుట్లు చుట్టుకున్న మఫ్లరును జుబ్బాక్రింద ఎక్కడో అణగారిపోయిన రొమ్ముపైనుంచీ క్రిందికి వ్రేలాడదీశాడు. ఆ ఆకారంలో చెప్పుకోదగ్గ విశేషం అతడి శిరోజ సంస్కారం. ఉవ్వెత్తుగా పైకిలేచి, లేచినంతవరకూ అంగుళానికి అయిదు వంకరలు తిరిగి, అక్కడనుంచీ ఏటవాలుగా క్రిందికిప్రవాలి మహాసముద్రానికి సింధుశాఖల్లా అవి వెనుకవైపున చెల్లాచెదరై వున్నాయి. పీల్చుకపోయిన దవడలపైన, కొండపేటులా నిటారుగా నిల్చున్న నుదురుక్రింద అతడి పిల్లికళ్ళు మిణుగురుపుర్వుల్లా మెరుస్తున్నాయి!

తలగడ క్రిందినుంచీ అప్రయత్నంగా తాళం చెవిని పైకితీశాను. ఎడమచేతితో తాళంచెవిని వూడలాక్కుని, తాళంతెరచి, తలుపు నొక తన్ను తన్ని అతడు లోపలికి వెళ్ళిపోయాడు.

మళ్ళీ నేను అంతూ పొంతూలేని ప్రశ్నావాహినిలో బడి కొట్టుకపోసాగాను. పవలంతా కనిపించని మనిషి, యితడీ అర్ధరాత్రివేళ ఎక్కడినుంచీ వూడిపడినట్లు? కొంపదీసి నిశాచరుడు కాడుగదా! ఈ యింట్లో యితడి హోదా ఏమిటి? ఇతడెక్కడుంటాడు? ఏం చేస్తుంటాడు?

ఎంతసేపాలోచించినా, నా శ్రమ చిట్టచివరకు ఊహాగానంలోనే పర్యవసించబోతుంది గనుక, నిజం నిలకడమీద తేలక పోదన్న నిర్ణయానికి

వచ్చేసరికి గడియారంలో చిన్నముల్లు అర్ధరాత్రి తర్వాత గూడా రెండెంకెలు దాటింది. అప్పటికే కళ్లు మండుతున్నాయి. ఎరుపు తిరిగిన కళ్ళతో. నిద్రమత్తులో జోగుతున్న ముఖంతో రేపటి వుదయం క్లాసులో నిల్చుంటే కుర్రాళ్ళు అష్టోత్తర శత నామావళితో పూజించినా పూజించగలరు. ప్రప్రథమంగా కుర్రాళ్ళపైన 'యింప్రెషన్' సృష్టించే లక్షణం యిదిగాదు. అబ్బే. యిదేమీ బాగుండడం లేదు.

కళ్ళు మూసుకుని, దుప్పటి బిగదన్నుకుని మళ్ళీ ఒకసారి నిద్రపోవడానికి ప్రయత్నించాను. కానీ నిద్రాదేవతను ఎంత చిత్తశుద్ధితో ఆరాధింపబూనుకున్నప్పటికీ, నా మనసులో మాత్రం ఆ పిల్లికళ్ళు నిరంతరాయంగా మెదలుతూనే వుండిపోయాయి.

ఆఖరుకు తెల్లవారు జామున ఎప్పుడో కునుకు పట్టింది. కానీ ఆ కలత నిద్రలోగన్న కలలోగూడా నాకు భూదేవిని చాపగా చుట్టుకపోతున్న హిరణ్యాక్షుడే కనిపించాడు!

★ ★ ★

నిద్రలేచేసరికి రెండు బారల ప్రొద్దెక్కింది. పరుపును చుట్టి మంచం పైనేవుంచి, మెట్లు దిగుతున్నాను. "మేష్టరుగారూ! మురళి యింకా నిద్రపోతూనే వున్నాడు" అంది కిటికీలోనుంచీ సుశీల.

"పుష్పపల్లకినుంచి ఎప్పుడొచ్చారు?" అన్నాను.

"మే మొచ్చేసరికి మీరు నిద్రపోతున్నారు."

"అలాగా! ఇప్పుడే వస్తాను" అంటూ ముందుకు సాగాను. ఊరి బయటికి వెళ్ళొచ్చేసరికి గంట ఎనిమిదిన్నరయింది. పది గంటలకు పది నిమిషాలకు ముందుగా మొదటి గంట మ్రోగుతుంది. ఆలోపల టీచింగు నోట్సు వ్రాసుకోవాలి. ఊరికి మధ్యగా పాతకాలపునాటి రచ్చదాపున వున్న అయ్యరుగారి పూరిపాకలో కాఫీ దొరికింది. 'కెలకులనున్న తంగెటి జున్ను గృహమేధి' అనుకున్న కాలం గతించింది. ఆ గృహమేధి ఔదార్యంలో యింకా ఏ శతాంశమో మిగిలివుంటే ఆ ఔదార్యలేశం ఈ అయ్యరుగారి

సొత్తే ననిపించింది. నెలకు ముప్పై రూపాయలు ముట్టచెబితే అతడు రెండు పూటలా భోజనం పెట్టడానికి సమ్మతించాడు. ఒక కూర, ఒక రసం. ఒక తాళింపు మజ్జిగ- యింతకంటే మరేమీ ఆశించడానికి వీలుండదని ఆ సమ్మతి క్రింద ఓ షరా పెట్టాడు. నా భోజన ప్రియత్వాన్ని కావలిస్తే ముందు నాళ్ళకు దాచుకుంటాను. ఇప్పుడు ఖాద్య పదార్థంలాంటి దేది దొరికినా చాలు నన్నాను.

టీచింగు నోట్సు వ్రాసి ముగించి, టైమ్ టేబిల్ నోట్ చేసుకోడానికి ఆఫీసురూంలో ప్రవేశించాను. యథాప్రకారం తన పనిలో నిమగ్నుడై వున్న గుమాస్తా నీలకంఠం "మా వూరెలా వుందండీ?" అన్నాడు.

"ఒకమాదిరిగా వుంది. ఉద్యోగం దొరికిన ప్రతి వూళ్ళోనూ మనకు సమస్త సౌకర్యాలెక్కడనుంచీ లభ్యమౌతాయి? పరిస్థితులకు అనుగుణంగా అలవాట్లనూ, ఆచారాలను సర్దుబాటు చేసుకోడమే గదండీ జీవితం" అని నాకు తెలిసిన వేదాంతం వెళ్ళబోసుకున్నాను.

నాతో కాసేపు తీరిగ్గా మాట్లాడదలచుకున్నాడేమో, అతడు కలం టేబిలుపైనవుంచి "వెధ్దరుగానీ, కూచోండి. తొందరేముంది?" అన్నాడు.

కుర్చీలో కూర్చుంటూ లోపలిగదివైపుచూచి "ఇంకా హెడ్ మిస్ట్రెస్ గారు వచ్చినట్లులేరే" అన్నాను.

"ఇంకెక్కడ వస్తారులెండి?" అన్నాడు నెమ్మదిగా నీలకంఠం.

"ఏం! ఎందుకు రారు?" నా ప్రశ్నలో విస్మయం ధ్వనించింది.

ఈ ప్రశ్నకు నా వెనువెంటనే లోపలికివచ్చి టీచర్స్ అటెండన్సులో సంతకం పెడుతున్న శర్మగారు ప్రత్యుత్తరమిచ్చారు. "జైత్రయాత్రను ముగించుకుని సార్వభౌములు రాజధానికి విచ్చేశారుగదండీ! శ్రీవారి కిక గొజ్జంగిపూ నీటిస్నానాలు, ధూపదీప నైవేద్యాలు, పూలపానుపు సేవలు మున్నగు సకలోపచారాలూ నిర్విఘ్నంగా నెరవేరాలి గదా!"

"సార్వభౌముడేమిటి, జైత్రయాత్రేమిటి? నాకంతా అయోమయంగా వుంది. కాస్తా వివరంగా చెప్పండి మేష్టరుగారూ!" అంటూ ప్రాధేయ పడ్డాను.

"అదేమిటండీ! మీరు రాత్రి ఆ యింటి వరండాలోనేగదా పడుకున్నారు? అతడి రాకను మీరు గమనించలేదేమిటి?" అన్నాడు నీలకంఠం.

"గమనించకేం బాబూ, గమనించాను. అప్పటినుంచీ అతడెవరో వూహించుకోలేక బుర్ర పాడుచేసుకుంటున్నాను" అన్నాను.

నీలకంఠం శర్మగారివైపు చూచాడు. శర్మగారు నా అమాయకత్వానికి జాలిపడుతున్నట్లుగా మెల్లగా నవ్వుతూ నా టేబిలుకు దగ్గరగా వచ్చి "సాక్షాత్తు ప్రమీలాదేవిగారి భర్త, పిల్లికళ్ళ ప్రేమానందగారినే ఎరుగరా కృష్ణమూర్తిగారూ!" అన్నారు.

ఊహించిన విపరీతం యధార్థమని తెలినప్పుడు తనలోని చైతన్యం నశించిపోగా మానవుడు స్తంభీభూతుడై పోతాడు కాబోలు! ఒక నిమిషంపాటు నేను నోరు విప్పలేకపోయాను. శర్మగారు భుజంపైన చేయి వేయడంతో తెప్పరిల్లి "కానీ, అతడు ఎక్కడినుంచీ వచ్చినట్టండీ?" అన్నాను.

"నదీనదాలు ఎక్కడ ఉద్భవిస్తున్నాయో నిర్దిష్టంగా చెప్పగలమా కృష్ణమూర్తిగారూ? ఇతడూ అంతే! ఎక్కడో వుంటాడు. ఇష్టమైనప్పుడు ఇక్కడికి వచ్చి వ్రాలిపోతాడు. ఈ రోజుల్లో పాదలేపనాలు లేవనుకోండి. బస్సులున్నాయిగా!"

ఐతే ఇతడు బస్సులో వచ్చాడన్నమాట! ఇంటిదగ్గర నేను బయల్దేరిన వేళావిశేష మెలాటిదోగానీ, మచ్చుకొక్క విషయం గూడా సూటిగా తెలిసి రావడంలేదు. అంతలోనే మళ్ళీ ఒక సందేహం తోచి "ఐతే, ఈ వూరికి అర్ధరాత్రప్పుడు గూడా బస్సులున్నాయటండీ?" అన్నాను.

"అది తొమ్మిది గంటల బస్సు. మార్గమధ్యంలో చెడిపోయి ఉండవచ్చు. అందుచేత లేటైవుంటుంది" అన్నాడు నీలకంఠం.

ఎలాగైతేనేం, ఇంతసేపటికి వివరా లొక్కటిగా బయటపడుతున్నాయి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోదలచి "ఇంతకూ అతడి వుద్యోగ మేమిటో చెప్పారుకారు" అంటూ మరొక సందేహం ప్రకటించాను.

"ఉద్యోగం! మరే ఉపాయమూలేని మీకూ నాకూ ఉద్యోగం గానీ అతడికేం ఉద్యోగమండీ! ప్రమీలాదేవి అంటే ఏమిటనుకున్నారు! అతడి పాలిటికి రూకలు కాసేచెట్టు. కావలిసినప్పుడలా వచ్చి దులుపుకుంటాడు. రాలిన రూకలు చేతబట్టుకుని మళ్ళీ బయల్దేరాడంటే, ఇక జేబు ఖాళీ కావాలి, అయ్యగారికి ఈ ప్రపంచంలో అమ్మగారొక రున్నారన్న విషయం జ్ఞప్తికి రావాలి. ఇదీ కథ!" అని సులోచనాలు సర్దుకుంటూ శర్మగారు బయటికి వెళ్ళిపోయారు.

గంట మ్రోగడంతో నీలకంఠంతో బాతాఖానీ ముగిసింది. ఆరు బయట జరుగుతున్న ప్రార్థనా సమావేశంలో అయిదు నిమిషాలసేపు నిల్చునే సరికి నీరెండకు కళ్లు గిర్రున తిరిగాయి. లోపలికివెళ్ళి ఓ టంబ్లరు మంచి నీళ్ళు త్రాగాను. ఒక అరగంటసేపు కదలకుండా పడుకుంటే నిద్రమత్తు వదలిపోవచ్చు, కానీ వరుసగా మూడో పీరియడుదాకా క్లాసు లున్నాయి. కుర్రాళ్ళ మీద సృష్టింప దలచుకున్న 'ఇంప్రెషన్' మాట దేవు డెరుగు! ఒకటి చెప్పబోయి మరొకటి చెప్పకుండా పాఠ్యాంశాన్ని సూటిగా వివరించి, మాట దక్కించుకో గలిగితే చాలు! ఈ ప్రయత్నంలో నే నెంతవరకూ కృతకృత్యుణ్ణి కాగలిగానో చెప్పలేను. ఒక నిమిషం కూడా ఎడతెరిపి లేకుండా, గ్రామఫోను రికార్డులా తెగవాగినమాట నిజమే! కానీ ఈ వాగుడుకు వస్తువును సరఫరా చేయవలసిన తలలో మాత్రం ప్రమీలాదేవిని గురించిన తలపులు, ప్రేమానందాన్ని గురించిన వూహలు కలగాపులగంగా రంగుల రాట్నంలా సుళ్ళు తిరిగిపోయాయి!

ఫోర్తుఫారం కుర్రాళ్ళకు సైన్సుపాఠంలో ఒక చిన్న ప్రయోగంచేసి చూపించవలసి వచ్చింది. వర్తులాకారపు అట్టముక్కకు ఓ వైపున చిలుక బొమ్మ, మరోవైపున పంజరం బొమ్మ చిత్రింపబడి వుంటాయి. ఆ అట్టను గిర్రున త్రిప్పినట్టయితే చిలుక పంజరంలోనే వున్నట్టు కన్పిస్తుంది. ప్రయోగాన్నిచేసి చూపిస్తున్నంతసేపు నేను నా మానసిక సంచలనాన్నే కుర్రాళ్ళ ఎదుట ప్రదర్శిస్తున్నానేమో అని భ్రమింపవలసి వచ్చింది!

మూడు పీరియడ్లూ మూడు యుగాల్లా గడచిపోయాయి. గడచి గట్టెక్కినంత సంతృప్తితో టీచర్స్ రూములో ప్రవేశించాను. గదిలో శర్మగారు, మేత్స్ యల్.టి. వెంకటసుబ్బయ్యగారు తప్పితే మరెవ్వరూ లేరు. వెంకటసుబ్బయగారు పేపరు చూస్తున్నారు. శర్మగారు ఎర్రసిరా కలంతో కాంపోజిషన్ పుస్తకాలపైన శస్త్ర చికిత్స గావిస్తున్నారు.

ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. ఉన్నట్టుండి శర్మగారే నోరు తెరిచేశారు:

"అహాహా, ఏం కుర్రాళ్ళండీ! మన అదృష్టం కొద్దీ దొరికిన మణిపూసలుగదండీ! ఒక ప్రబుద్ధుడు వ్రాస్తున్నాడు శుభమాటట, శుభమాట!" శర్మగారు కలం టేబిలు సొరుగులో పారవేశారు. సులోచనాలు తీసి టేబిలు పైన వుంచీ మళ్ళీ ప్రారంభించారు: "అసలిక్కడేకాదు. నేను వెయ్యిచోట్ల చూపిస్తాను. ఒకాయన 'ప్రథమ కూర్పు' అంటాడు. ఇంకొకాయన మొగమాటంలేకుండా 'కుండవృష్టి' అని వ్రాసేస్తాడు. ఇలాటి సమాసాల్ని ఏమంటారో ఎరుగుదురా కృష్ణమూర్తిగారూ?"

ఏమంటారని నేనడగలేదు. వెంకటసుబ్బయ్యగారు అడిగారు.

"దుష్ట సమాసమంటారు!" ముదలంకించుకున్నారు శర్మగారు "నాకు తెలియక అడుగుతాను. తాతాచార్లకూ, పీర్లపండగకూ ముడి పెట్టాలంటే కుదురుతుందటండీ? ఐతే ఒకటి. ఇలాటి స్నేహితాలు,దాంపత్యాలూ ప్రపంచంలో లేవా అని మీరు అడుగవచ్చు. నిజానికి ఉండగూడదు కానీ. ఉన్నాయి, మహాకవులు గూడా—వాళ్ళ విజ్ఞతను శంకించడం కాదుగానీ. ఎందుచేతనో మరి 'కపిలగడ్డము' అన్నారు. 'కఱకంఠుడు' అన్నారు. చెప్పవచ్చిందేమిటంటే వెంకటసుబ్బయ్యగారూ, మహాకవుల్లాగానే భగవంతుడు గూడా అప్పుడప్పుడూ పొరబడుతున్నాడేమో అనిపిస్తుంది."

"ఎంతమా టెంతమాట? కానీ ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకండీ?" అన్నారు వెంకటసుబ్బయ్యగారు. సుబ్బయ్యగారికి శర్మగారి సమాసాల గొడవేమీ తలకెక్కినట్టులేదు. పోనీ, ఉపాధ్యాయ వృత్తిలో తలబట్టగట్టి పోతు

న్నప్పటికీ తెలియకపోయినా తెలిసినట్టు ప్రవర్తించగల నటనాకౌశలం గూడా ఆయనకి నచ్చినట్టులేదు!

"మీ కేమాటగానీ స్పష్టంగా చెప్పకపోతే బోధపడదు సుబ్బయ్యగారూ! పిల్లికళ్ల ప్రేమానందం మళ్ళీ వచ్చి వూళ్ళో దిగడిపోయాడు" అని, అంతటితో తమ పని తీరిపోయినట్లు శర్మగారు జేబునుంచీ పొడి డబ్బీ పైకి తీశారు.

"వచ్చాడా వాడు! వాడికి ముఖమెలా చెల్లిందండీ! అయితే అందుకేనన్నమాట కాజువల్ లీవు! ఆ మానాభిమానాల్లేని పచ్చి మోసగాడు, దమ్మిడీకి కొరగాని చవట, వాడు రావడమున్నా ఈమెగారు మళ్ళీ వాణ్ణి ఇంట్లో చేరనివ్వడమూనా! గోహత్య చేయవచ్చుగదండీ వాడి ముఖం చూడ్డంకంటే! వాడూ ఒక మనిషే, అదీ ఒక బ్రతుకే! ఛీ...."

వెంకటసుబ్బయ్యగారిలో అతి విచిత్రమైన పరిణామం ప్రారంభమైంది. ఆయన హ్రస్వకాయుడు. సంధ్యారాగంలాంటి శరీరచ్ఛాయ. ఎగుడు దిగుళ్ళతో కందగడ్డలాంటి ముఖం. చంద్రబింబానికి మల్లే కోపానికి గూడా పదహారు కళలనుకున్నట్టయితే, ఆయన ఒక్కొక్కమాట అంటుండగా ఒక్కొక్క కళ అదొక నీడలా ఆ ముఖంలో హత్తుకోసాగింది. ఆ కోపం తాకిడికి ఆయన వేడినూనెలో వేగుతున్న తినుబండంలా ఆపాదమస్తమూ కంపించి పోసాగాడు.

"అయిదూ, పదీకాదు. రెండువందల రూపాయలు. ఇటు స్కూల్లో చాకిరీ చేస్తూ, రాత్రుల్లో మేలుకుని పేపర్లు కరెక్టు చేయగా ముట్టిన ప్రతిఫలమండీ! ఆమె చెక్కు మార్చిందో లేదో, వీడు డబ్బు చేతబట్టుకుని పరారీ చిత్తగిస్తాడా? బిడ్డ చేతులకు గాజులుచేసి పెట్టాలని ఆమె చెబితే, రేపే తీసుకొస్తాను లెమ్మన్న పెద్దమనిషికి రెండు నెలల తర్వాత ఈ నాటికి దోవ తెలిసిందా? కట్టుకున్న భార్యపైన లేకపోతే పోయే, కన్నబిడ్డపైన గూడా మమకారం లేకపోతే వాడిని మనిషి అని ఎందుకనాలండీ? ఏం, ఎందుకు పశువనగూడదు? ఐనా యింతటి నైచ్యమా? ఇంత దారుణమా? ఇంత...."

వెంకటసుబ్బయ్యగారు పళ్ళు పటపట కొరుకుతూ పైకి లేచారు. ఆయన మనోవీధిలో వరుసగా మూడు గుర్రాలు పరుగెడుతున్నాయి. మొదటిది ఆవేశం. రెండోది భావం. మూడోది భాష. మొదటి గుర్రం శర వేగంతో పరుగెడుతోంది. రెండో గుర్రం మొదటివాని అడుగుజాడల వెంబడే దౌడు తీయగలుగుతోంది. మూడో గుర్రం మాత్రం బాగా వెనుకబడి పోయింది. ఈ పరుగుపందెం తాలూకు సంక్షోభానికి ఆయన ముఖమంతటా గుప్పుగుప్పున చెమట క్రమ్ముకుంటోంది.

"మీరు నమ్మితే నమ్మండి, నమ్మకపోతే పోండి. ఆమెకు రెండంటే రెండు చీరలు మాత్రమే వున్నాయి. మీరు కావలిస్తే వాకబుచేసి చూడండి, ప్రతినెలా వంటలక్కకు బాకీ. పాలవాడికి బాకీ. ఇంటద్దె బకాయి. సంపాద నంతా వీడు తన వాత గొట్టుకుపోతుంటే ఆమె సంసారాన్ని యెలా యెలా ఈదగలదో చెప్పండి?"

"నేనేం చెప్పగలనండీ! అసలు నేను ప్రపంచంలోనే సంచరిస్తు న్నానా, లేకపోతే ఏదైనా నాటకాన్ని చూస్తున్నానా అని నాకే తెలియకుండా వుంది" అన్నాను.

వెంకటసుబ్బయ్యగారు మళ్ళీ కుర్చీలో కూర్చున్నారు. ఆవేశం కొంత తగ్గుముఖం పడుతుందేమోనని కళ్ళుమూసుకున్నారు. కానీ చెప్పవల సిందంతా చెప్పేస్తేగానీ ఆవేశం వుపశమించే సూచనలు లేవు.

"ఏమనుకుంటున్నారో, వాడు నీటిలో చేపకు ఈత నేర్పించే ఘట మండీ! ఈ రోజె నిమిదో తారీఖు. ఎంత ఆలస్యమైనా వదో తేదీలోగా జీతం రాక తప్పదని వాడికి బాగా తెలుసు. చూచారా, సమయానికి అపెండిసైటిస్ యిచ్చేశాడు. డబ్బు చేతికి రాగానే బస్సెక్కేస్తాడు. నేను వున్నదీ లేనిదీ కల్పించి చెబుతున్నాననుకుంటున్నారేమో! అబ్బే, నా కెందుకొచ్చిందండీ! అదిగో వినండి. గంటకూడా మ్రోగింది. సరేనా కృష్ణమూర్తిగారూ!"

ఎదుటివారి బాధను తమలో పలకరించగల చిత్తశుద్ధి చాలా తక్కువ మందికి వుంటుంది. అందుచేతనే గావచ్చు జగన్నాటకంలో వెంకట

సుబ్బయ్యగారిలాంటి 'కారెక్టర్' నటులు అరుదుగా కనిపిస్తారు. ఇంతలో మరపువచ్చేవిగావు ఆయన మాటలు! నేను అయ్యరుగారి పూరిపాకకు వెళ్ళి భోజనం చేశాను. మళ్ళీ స్కూలుకు తిరిగి వచ్చాను. మధ్యాహ్నానంతరం రెండు పీరియడ్లు క్లాసు తీసుకున్నాను. కానీ ఆయన మాటలు మాత్రం చెవుల్లోరింగురింగుమని మార్మోగిపోతూనే వున్నాయి.

సాయంత్రం అయిదుగంటలవేళ. నిర్జనంగా వున్న పాఠశాల పరిసరాల్లో ఓ మూలగా వెళ్ళి యిసుకలో కూర్చున్నాను. "ఇక్కడున్నారా మేష్టరుగారూ! మీకోసం ఎక్కడెక్కడ వెదికామని!" అంటూ పరుగునా వచ్చి మురళి యిసుకలో దూరాడు.

"అక్కయ్యేదీ?" అని ప్రశ్నించాను.

"నాతోనే వచ్చిందే! ఏదీ! అదిగో! రావే అక్కయ్యా! మన మేష్టారే గదూ! సిగ్గెందుకూ?" అంటూ మురళి సుశీలను చెట్టువెనుకనుంచీ నా దగ్గరికి లాక్కొచ్చాడు.

పిల్లలతో కలిసి యిసుకలో పిచ్చుకగూళ్ళు కట్టుకోవాలనిపించింది. కానీ పిచ్చుకగూళ్లు కట్టుకోవలసిన పిల్లలే నాకంటే గంభీరంగా కూర్చున్నారు. మురళి నా జేబులోనుంచీ డైరీ తీసుకుని దీక్షగా పరిశీలిస్తున్నాడు.

"ఊరినుంచీ నాన్నగారొచ్చారటగా మురళీ!" అన్నాను.

మురళి తల పైకెత్తి నా కళ్ళలోకి చూశాడు. వెంటనే ఏదో నేరం చేసినవాడిలా తల దించేసుకున్నాడు.

అయ్యో పాపం! నా ప్రశ్నలవల్ల వాడి లేతమనసుకు బాధ కలిగిందేమో! ఐనా కుర్రవాళ్ళింత 'సెన్సిటివ్'గా వుండకూడదు.

కాసేపు ముగ్గురమూ మౌనంగా కూర్చున్నాము. "ఇంటికి వెళ్దాంరా మురళీ!" అంది సుశీల,

"అప్పుడే యింటి కెందుకూ? ఇందాకా ఏడ్చింది చాలదూ?" అన్నాడు మురళి.

"ఏడవడ మెందుకూ? ఏం జరిగింది మురళీ?" అన్నాను.

"ఏడవకేం చేస్తుంది? గాజులు తెస్తారులే, తెస్తారులే అని అమ్మ ఆశ చూపెట్టింది. తీరా చూస్తే గాజులూ లేవు, గిజులూ లేవు. ఎక్కడ అని అడిగితే కొట్టబోయాడు. గాజులు లేకపోతే మానె, కొట్టకుంటే చాలు...."

"ఊరుకోరా మురళీ!" సజల నేత్రాలను నాకు కనిపించకుండా ముఖం అవలికి త్రిప్పుకుంది సుశీల.

"చూడండి మేష్టరుగారూ! మళ్ళీ ఏడుస్తోంది" అన్నాడు మురళి.

"ఛా, ఏడవడ మెందుకు సుశీలా! తప్పుకాదూ?" అంటూ ఆ అమ్మాయిని దగ్గరికి తీసుకున్నాను. వాడిన మల్లెపువ్వులా క్రుంగిపోతూ ఆ పిల్ల వెక్కి-వెక్కి ఏడవసాగింది.

ఏడ్చి, ఏడ్చి తనకుతానే వూరడిల్లింది సుశీల. కళ్ళు తుడుచుకుంటూ దూరంగా జరిగి యిసుకలో నిశ్చలంగా కూర్చుంది.

కన్నీరు నించడం, కష్టాలు భరించడం—యిదేగదా భారతదేశపు సతీత్వం అన్నాడు రవీంద్ర కవీంద్రుడు. సుశీలను చూస్తుంటే ఆమె బాధా సహిష్ణుతకు తరిబీదవుతున్నట్లు తోచింది.

ప్రొద్దుపోయి చీకటి పడబోతుండగా పిల్లలు యింటికి వెళ్ళి పోయారు.

హెడ్‌మిస్ట్రెస్‌గారు మరునాడుకూడా లీవును పొడిగించారు. మూడో రోజు వుదయానగానీ ఆమెను కలుసుకోవడం తటస్థించలేదు.

"రెండు రోజులుగా కనిపించారుగారే!" అంటూ ఆమె పలక రించింది.

"మీరు స్కూలుకు రాలేదు గదండీ!" అన్నాను.

"అవును. రాలేదు. ఇంటిదగ్గర పనులుండి నిలిచిపోయాను." స్వగతంలా మెల్లగా చెప్పుకుంది ప్రమీలాదేవి.

ఆ రోజు సాయంత్రం షికారుకు తప్పకుండా వస్తానని మురళికి మాట యిచ్చాను. కాఫీ త్రాగి అయ్యరుగారి పాకలోనుంచి బయటకు వచ్చే సరికి రోడ్డులో శర్మగారు తారసిల్లారు.

"అతగాడింట్లో లేడండీ! మధ్యాహ్నమే వెళ్ళిపోయినట్టున్నాడు" అన్నారు శర్మగారు.

"అలాగా! మీ రక్కడికి వెళ్తొస్తున్నారేమిటి?" అని ప్రశ్నించాను.

శర్మగారు జేబులోనుంచీ మామిడిపిందెల నెక్లెసు పైకి తీశారు. ఓ క్షణంపాటు నన్ను చూడనిచ్చి, మళ్ళీ దాన్ని జేబులో వేసుకుంటూ "దీన్ని తాకట్టువుంచి నూరు రూపాయలు తెచ్చిపెట్టమని ఆజ్ఞ-కాకపోతే వేడికోలు" అన్నారు.

నా తల దిమ్మ తిరిగింది.

"ఎందుకూ?" అప్రయత్నంగా అడిగాను.

"పైసా చేతిలో లేకపోతే ఈ నెలంతా ఎలా జరుగుతుందండీ?" పిచ్చిగా నవ్వుతూ అన్నారు శర్మగారు.

★ ★ ★

వెంకటసుబ్బయ్యగారు తమ పలుకుబడిని వినియోగించి చెరకుబెల్లం గిడ్డంగిగా వుపయోగంలోవున్న మంటి మిద్దెలో ముందుభాగాన్ని ఖాళీ చేయించి నా కిప్పించారు. నాకు పూర్వం ఆ మంటి మిద్దెలో పందికొక్కులు కాపురముండేవి. ఇప్పుడుకూడా పుట్టింటిపైన మోజును వదలనాడుకోలేక అవి ఏ అర్ధరాత్రప్పుడో వచ్చి, నే నాలనా, పాలనా విచారించి సారెపెట్టి పంపలేకపోతుండడంచేత రుసరుసలాడుతూ వెళ్ళిపోతున్నాయి. కూరా, చారు, మజ్జిగ అని ఓ చిన్న జాబితా యిచ్చి, అంతకంటే మరేమీ ఆశించ డానికి వీలుండదన్న అయ్యరు తన షరతును తానే అతిక్రమించి అన్నంతో కలిపి రాళ్ళను, కూరతో కలిపి చింతగింజలను వడ్డిస్తున్నాడు. స్కూల్లో గడియారాన్ననుసరించి గంట మ్రోగుతోంది. పిలబసు మేరకు పాఠాలు జరుగుతున్నాయి. ఐతే ఎవరికొరకు గంట మ్రోగుతోందో, ఎవరికోసం పాఠాలు బోధింపబడుతున్నాయో ఆ కుర్రాళ్లు మాత్రం చదువుసంగతి అంతగా పట్టించుకోడంలేదు. వాళ్ల మాటిమాటికి అడ్డుతగిలి ప్రశ్నలతో విసి గిస్తారు, లేదా తమంతట తామే యిదివరకెక్కడలేని క్రొత్త సిద్ధాంతాలను

ప్రతిపాదిస్తారు. ఆ ప్రశ్నలకు బదులు చెప్పలేక. ఆ సిద్ధాంతాలను పూర్వ పక్షం చేయలేక ఉపాధ్యాయులు సతమతమౌతున్నారు.

అన్నింటికన్నా ముఖ్యమైన విషయం. ఈమధ్య ఫిరంగిపురానికి ప్రేమానందంగారి దర్శన భాగ్యం కలుగలేదు! ఎక్స్‌ప్రెస్ డెలివరీలో వుత్తరం వ్రాసి. టి. యం. ఓ. ద్వారా ఏభై రూపాయలు గుంజుకున్నాడన్న వార్త మాత్రం విశ్వసనీయ వర్గాలద్వారా తెలిసింది.

గానుగచక్రంలా జీవితం ఒక గాడిలో పడిపోయిన తర్వాత రోజులు వాళ్ళు తెలియకుండా వెళ్ళిపోయేటట్టున్నాయి! చూస్తూచూస్తూ వుండగానే రెండు మూడు మాసాలు చల్లగా కాలగర్భంలోనికి దొర్లిపోయాయి.

ఆరోజు సోమవారం. పది పదిహేను రోజుల్లో క్వార్టర్లీ పరీక్షలు జరుగనున్నాయి. ప్రశ్నపత్రం 'సెటప్' చేయడంలో కలిగిన సందేహాలను నివృత్తి చేసుకోదలచి కాస్త త్వరగా స్కూలుకు బయలుదేరాను. నేను వెళ్ళేసరికి టీచర్సు రూములో ఎవరూ లేరు. కేవలం పోలిక కోసమే చెబుతున్నాను- ఎవరుండినా ఎవరుండకపోయినా గోరీదగ్గర గుంట నక్కలా నీలకంఠానికి ఆఫీసురూములో కూర్చుని పనిచేయకపోతే తీరదు. నేను ద్వారందగ్గర కనిపించగానే "ఈ సంగతి విన్నారా కృష్ణమూర్తీ!" అన్నాడు నీలకంఠం. ఏమిటన్నాను.

నీలకంఠం చేతులుపైకెత్తి, ఒళ్లు విరుచుకుంటూ "హెడ్‌మిస్ట్రెస్ గారు నాలుగురోజులు సెలవుపెట్టేశారు" అన్నాడు.

"కొంపదీసి మళ్ళీ అతడొచ్చిపడలేదు గదండీ!" ఈ మాటల్ని నేను బహుశా నిద్రలో కలవరించినట్టుగా అనివుంటాను.

"ఏమో, ఎవరెరుగుదురు? ఒకవేళ వచ్చేశాడేమో! లేకుంటే రాబోతున్నాడేమో! రాదలచుకుంటే అతణ్ణి అడ్డేవాళ్ళెవ్వరు? పోదలచుకుంటే పట్టేవాళ్ళెవ్వరు?"

ఆశ్చర్యమేమిటంటే ఊళ్ళో పిల్లి ప్రసవించిన వార్తనుగూడా ముమ్మందుగా పసిగట్టగల శర్మగారు సైతం హెడ్‌మిస్ట్రెస్‌గారి సెలవు చీటీనిచూచి ఆశ్చర్యాన్నే ప్రకటించారు.

"వచ్చేశాదేమోనండీ! లేకపోతే యిప్పుడీ సెలవెందుకు? వాడు ధూమకేతువు. ఫలానప్పుడు, ఫలానాచోట కనిపిస్తాడని మనం వూహించ లేము. కానీ ఎక్కడెక్కడైతే వాడు కనిపిస్తాడో అక్కడల్లా అరిష్టమే!" అంటూ శర్మగారు ఆ వార్తపైన సంగ్రహంగా వ్యాఖ్యానించారు.

ఇక వెంకటసుబ్బయ్యగారి సంగతి సరేసరి! ఆయన టీచర్సు రూములో ఉగ్రనరసింహుడే అయిపోయారు.

కానీ తోకగూడా సరిగ్గా కనిపించకమునుపే పులినిగురించి వూహించు కున్నందుకు మేమందరమూ సమిష్టిగా కించపడవలసి వచ్చింది.

ఆరోజు సాయంత్రం యింటికి వెళ్ళేసరికి, స్కూలునుంచీ సరాసరి అక్కడికివచ్చి నాకోసం వేచివున్న మురళి కనిపించాడు.

"అదేం మురళీ, నువ్వాక్కడికే వచ్చావు?" అన్నాను.

"అక్కయ్య స్కూలుకు రాలేదు.అమ్మకు జ్వరంగా వుందిగా!...." అన్నాడు మురళి.

"జ్వరంగా వుందా? నిజంగా!" అంటూ తెల్లబోయాను.

"రాత్రంతా జ్వరంకాసిందట. నాకు తెలియదు. అమ్మేచెప్పింది. మధ్యాహ్నం నేనుగూడా చూచాను, ఒళ్ళు పెనంలా కాలిపోతోంది."

నిజమే! ఆ వచ్చిన జ్వరం మురళి చెప్పినంత తీవ్రంగానే వచ్చింది. సూదిలోనికి మందెక్కిస్తున్న స్థానిక హోమియోపతీ డాక్టరు "చేతనైతే మీరామెకు కాస్తా ధైర్యంచెప్పండి మేష్టరుగారూ! ఇది నిమోనియా! మని షిని పీల్చి పిప్పిచేసే వాటిల్లో అన్ని జబ్బులూ దీని తరువాతివే. అందు లోనూ ఆమె చాలా బలహీనంగా వుంది" అన్నాడు.

తెల్లటి దుప్పటి పరచిన పట్టె మంచంపైన, త్రుంచి ఎండలో పారవేసిన అరిటాకులా శోష్లిల్లిపడిపోయివున్న రోగిని చూచేసరికి నాకు గుండె గుభేలుమంది.

"కూచోండి" అంది ప్రమీలాదేవి. ఆ మాట బావిలోపలినుంచి వచ్చినట్టుంది.

"ఇదేమిటి మేడమ్! ఒక్కరోజు జ్వరానికే యిలాగైపోతారా ఎక్కడైనా?" అంటూ కుర్చీలో కూర్చున్నాను.

పై కప్పువంక చూస్తున్న ప్రమీలాదేవి ముఖం నా వైపుకు త్రిప్పింది. త్రిప్పగానే సూది చేతబట్టుకుని పైకొస్తున్న డాక్టరు ఆమె చూపు కెదురయ్యాడు. గట్టిగా పళ్ళు బిగపట్టుకుని, కళ్ళు మూసుకుంది ప్రమీలాదేవి.

ఇంజక్షనువేసి మందు తీసుకోవలసిన విధానాన్ని వివరించి డాక్టరు వెళ్ళిపోయిన తరువాత చాలాసేపటివరకూ నేనలాగే కూర్చుండిపోయాను. ఓపరికం లేకపోవడంచేత వుండీ వుడిగీ అప్పుడొకమాటగా, ఇప్పుడొక మాటగా మాట్లాడుతోంది ప్రమీలాదేవి.

"వంటలమ్మిని నాకు తోడుగా వుండిపొమ్మన్నాను. ఆమె అప్పుడప్పుడూ లేచి మందిస్తుంది. ఇప్పుడు పిల్లలు దిగులుపడిపోతారేమోననే నా బెంగ!"

"మీరు మరేం బెంగపెట్టుకోకండి మేడమ్! నాకంతకంటే పనేముంది? మీ కారోగ్యం కుదిరేంతవరకూ నేనూ యిక్కడే వుంటాను" అన్నాను.

"అంతకంటేనా కృష్ణమూర్తీ! మీరు దగ్గరుంటే మురళి ధైర్యంగా వుంటాడు."

ఆ పూట నేనుకూడా అక్కడే భోజనం చేశాను. పిల్లలకు పడుకోగానే నిద్రపట్టింది. నేనూ నిద్రపోయే ప్రయత్నంలో వున్నాను.

"కృష్ణమూర్తీ!" పిలిచింది ప్రమీలాదేవి.

గదిలోపలికి వెళ్ళాను. "నిద్రొస్తున్నదేమిటి?" ఆమె ప్రశ్నించింది.

"అబ్బే, లేదు మేడమ్! పది పదకొండు గంటల దాకా చదువుకోడం నా వాడుక" అన్నాను.

"ఐతే కూచోండి." పెళ్లుమని కాస్తున్న జ్వరం శుష్కీభూతమైన ఆమె శరీరంలో ఒదిగివుండలేక నిగనిగలాడుతున్న అగ్గిమీద సెగలా నిట్టూర్పుల రూపంతో బయటపడుతోంది. కదులుతున్న ఆ పెదవులకు వెనుక,

విషాద వివర్ణమౌతున్న ఆ ముఖానికి వెనుక ఆమె హృదయంలో ఏదో తుపాను చెలరేగుతోందని నేను పోల్చుకోగలిగాను.

"ఇది నాకు కొత్తకాదు, ప్రతి సంవత్సరమూ నాకిలా ఏదో ఒకటి ముంచుకొస్తుంది. ఉన్నట్టుండి నేను కళ్ళుమూసుకు పోతాననుకోండి కృష్ణ మూర్తీ! ఈ పిల్లల గతేం కావాలి?" ఆమె కళ్ళల్లో కన్నీళ్లు క్రమ్ము కున్నాయి.

"ఊరుకోండి మేడమ్! ఇలాంటి ఊహలతో మీరిప్పుడు మనసును పాడుచేసుకోడం మంచిదిగాదు." కాసేపు తటతటాయించి మళ్ళీ అన్నాను: "ఆయన కొక జాబు వ్రాయకూడదా మేడమ్?"

"చిరునామాలేని మనిషికి జాబెలా వ్రాస్తారు? మీరు లోకంలో ఎన్ని విచిత్రాలనయినా చూచి వుంటారు. కానీ యిలాంటి విడ్డూరం మాత్రం మీకు కనిపించి వుండదు. మనం ఉద్యోగాలు చేయడం మిద్దెపైన మిద్దెకట్ట డానికి కాదు. కానీ లోకంలోవున్న దుర్వ్యసనాలన్నీ ఈ ఒక్క మనిషిదగ్గరే వుంటే నా సంపాదన ఎక్కడికి చాలుతుంది? ఒక్క సిగరెట్టుకాదు. ఒక్క పేకాట గాదు. ఒక్క గుర్రప్పందాలు కాదు. వందరూపాయలిచ్చినా చాలదు. అప్పుచేసి రెండువందల రూపాయ లిచ్చినా చాలదు. ప్రయత్నలోపం జరిగిం దనుకోకండి కృష్ణమూర్తీ! ప్రాధేయపడ్డాను. బ్రతిమాలుకున్నాను. గోడకు తలమోదుకున్నాను. లాభం లేకపోయింది. ఇచ్చిన వాగ్దానాలు, చెప్పిన నమ్మ కాలు అన్నీ గంగపాలు. త్రాగను త్రాగనని ఒట్టుపెట్టుకుని కల్లుపాకలో ప్రవేశించినవాడి కథ మీకు తెలిసే వుంటుంది.

"ఆఖరుకు చెడిపోయే దెవరు కృష్ణమూర్తీ?" అగ్నిపర్వతం చీల్చు కుని పైకి వెలువడిన లావాద్రవంలాంటి ఈ ప్రశ్నల తాకిడికి వులికిపడ్డాను. ప్రమీలాదేవి దీనంగా ప్రశ్నిస్తోంది-"నా బిడ్డలే గదూ?....భగవంతుడి దయవల్ల నాకింకా నూకలు బాకీవున్నాయనుకోండి. కానీ ఇంక పదేళ్లుగడిచినా, యిరవ య్యేళ్లు గడిచినా చివరకు నన్నెదుర్కొబోయే ప్రశ్న యిదేగదూ?"

నెమ్మదిగా వుండటంపోయి, ఉద్రేకం తెచ్చుకోడం వ్యాధికి మరింత దోహదం చేకూరుస్తుంది. పొగిలి పొగిలి రగులుకుంటున్న కుంపటిని నేను నా మాటలతో కలచివేయ దలచుకోలేదు.

పది పదిహేను నిమిషాలు మౌనంగా గడచిపోయిన తర్వాత "దీనికే దైనా వుపాయం చెప్పగలరా కృష్ణమూర్తి?" అంది ప్రమీలాదేవి.

నే నేదో చెప్పబోయాను. కానీ అంతలోనే ఆమె అడ్డు తగిలింది:

"ఇప్పుడే వద్దు. ఆలోచించి చెప్పండి."

నేనాలోచించాను. ఒకటికాదు, రెండుకాదు- వారం రోజుల పొడుగునా ఆలోచించాను, ఈ వారం రోజుల్లో జ్వరం తగ్గు ముఖం పట్టింది. కానీ ఆమె మదిలోనూ, ఎదలోనూ తీవ్రకల్లోలం మాత్రం అలాగే వుండి పోయింది.

"ఏమాలోచించారు, ఏమాలోచించారు?" అని ప్రమీలాదేవి నాలుగైదుసార్లు అడిగింది, ఆ ప్రశ్నలకు నా మూకీభావం మాత్రమే ఆమెకు సమాధానంగా లభించింది.

పరీక్షలు జరుగుతున్నాయి. మధ్యాహ్నంపైన స్కూలుకు వెళ్ళవలసిన అవసరం లేనందున ఇంట్లో పడుకుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. "అమ్మ పిలుచుక రమ్మంటోం" దని గసబోసుకుంటూ పరుగెత్తి వచ్చాడు మురళి.

"ఏమిటి మురళి? ఏం జరిగింది?" అన్నాను.

"వాడెవడో టౌనునుంచీ వచ్చాడు!"

"ఎవరు? ఎందుకొచ్చాడు?"

"ఎవరో మరి! పొడుగ్గా కోటు వేసుకున్నాడు. తలపాగా చుట్టుకున్నాడు. కళ్ళకు నూలుపోగద్దాలున్నాయి. ముక్కులకింద ఇంతంతలేసి మీసాలు గూడా ఉన్నాయండీ మేష్టారుగారూ!"అంటూ మురళి వచ్చినవాడి ఆకార విశేషాల్ని వర్ణించాడు.

ఆ అమీనా వేషధారి ఎవరో తెలియక విస్తుపోయాను. నేను వెళ్ళే సరికి అతడు వరాండాలో తారట్లాడుతూ కనిపించాడు. ఓ క్షణం అతణ్ణి ఎగాదిగా చూచి లోపలికి వెళ్ళాను. ప్రమీలాదేవి తన చేతిలోవున్న చీటీని టేబిలుపైన ఉంచింది.

ఆ చీటీలో ముక్తసరిగా నాలుగైదు వాక్యాలు మాత్రమే ఉన్నాయి:

"మైసూరులో దసరా వేడుకలు జరుగబోతున్నాయి. ఇదే ఆఖరు సారి.........

(ఈయన దేశంపైకి బయల్దేరడానికి గాదు, మైసూరులో దసరా వేడుకలు జరగడానికి!)

"పాంట్లు,చొక్కాలు కావలసివచ్చాయి. బిల్లు నూరు రూపాయలదాకా దేకింది. డబ్బు యితనికి ముట్టజెప్పవలసినది...."

నా ప్రయత్నం లేకుండానే చీటీ వ్రేళ్ళమధ్య నలిగిపోయింది. కోపంతో ఒళ్లు మరచిపోవలసిన అవసరం నాకెన్నడూ కలుగలేదు. కాని ఈ సంఘటన నన్ను పునాదులనుంచీ కదలించివేసింది. కొత్త దుస్తులతో ముస్తాబై మగడు పూలరంగడికిమల్లే మైసూరువేడుకలకు బయల్దేరితే, ఓ గ్లాసుడు పాలుగూడా త్రాగడానికి త్రాణలేక మంచంపైన పడివున్న భార్య అతడు డాబుసరికోసం చేసిన బాకీ చెల్లించడమా! ఇది అన్యాయం,అక్రమం.

చరచరా బయటికి వెళ్ళి ఆ చీటిని ఆగంతుకుడి ముఖానవిసరికొట్టాను "చీటి ఇచ్చాడు గదా అని పనిగట్టుకుని యిలా పరుగెత్తి రావడం మీ తెలివి తక్కువ. ఎవరికిచ్చారో వారిదగ్గరే మీరు డబ్బు వసూలుచేసుకోవచ్చు" అన్నాను.

"వద్దొద్దు. మీ రిలారండి కృష్ణమూర్తీ!" కిటికీ తలుపులు తీసి మళ్ళీ నన్ను లోపలికి పిలిచింది ప్రమీలాదేవి.

"మీరనే దేమిటి మేడమ్! ఒక దసరా సంబరాలేగావు దేశంలో జరిగేవి! బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తెప్పతిరుణాళ్లు జరుగుతాయి. ఎగ్జి

విషన్లు జరుగుతాయి. ఆయన వాటిని చిత్తగించదలచుకున్నప్పుడలా మీకిలా పర్మానా జారీ చేసేస్తాడు. ఎక్కడినుంచీ తేగలరు మీరు డబ్బు?"

"ఆ చీటీలోని మాటలతోనే చెబుతున్నాను కృష్ణమూర్తీ! ఇదే ఆఖరు సారి. నా దగ్గర ఏభై రూపాయ లున్నాయి. మిగిలిన యాభై రూపాయలను శర్మగారి నడగండి."

ప్రేమానందంగారి చెక్కు ప్రమీలాదేవిగారి బ్యాంకులో మారిన తక్షణం అమీనా వేషధారి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

"చివరకు మీరు చేయదలచుకున్నదేమిటి మేడమ్?" నిక్కచ్చిగా అడిగేశాను.

"మీరేమాలోచించారు?" అంది ప్రమీలాదేవి.

ఆ అంతిమోపాయమేదో ఆమెకూ తెలుసు, నాకూ తెలుసు. కానీ ఆమాట నానోటనుంచే రాబట్టాలని ఆమే, ఆమె నోటినుంచే రాబట్టాలని నేనూ, వారం రోజులనుంచీ విశ్వ ప్రయత్నం చేశాము. ఆఖరుకు ఈ ప్రయత్నంలో ఆమె గెలిచింది, నేనే ఓడిపోయాను.

"తరతరాల సాంప్రదాయంపట్ల నాకు గౌరవం లేదనుకోకండి మేడమ్! కానీ పెద్దలేమన్నారు? దుష్టాంగాన్ని ఛేదించి మిగిలినవాటిని రక్షించుకోడం అవశ్యకర్తవ్యమన్నారు. మన విశ్వాసాలకూ, మన సంఘ వ్యవస్థకూ విడాకుల చట్టం సరిపోదని నేను భావించేవాణ్ణి. కానీ ఈ లోకం మన మనుకున్నంత మంచిది గాకపోవడం అటుండగా, మంచిని గాసిపెట్టే ప్రవృత్తిగూడా ఇక్కడ విచ్చలవిడిగా కనిపిస్తోంది. అందుచేత నే నీరోజున ఆ చట్టంయొక్క అవశ్యకతను గుర్తిస్తున్నాను. ఎవరైనాసరే, కొన్ని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో దాని ఆవశ్యకతను గుర్తింపక తీరదేమోననే నా ఉద్దేశం...... ..."

"నా నిర్ణయమూ అదే" అంది ప్రమీలాదేవి.

నాకు పట్టరానంత ఆనందం కలిగింది. వరదల్లో కొట్టుకపోతున్న ప్రాణిని ఒడ్డుకు చేర్చినప్పుడు కలిగే ఆనందం ఎలాటిది? సరిగ్గా నాకలాటి ఆనందం కలిగింది.

వివాహం ఆచారం ప్రకారం జరిగితే, విడాకులు చట్టాన్ననుసరించి రూపొందుతాయి. ఆరునెలల మునుపటినుంచీ వివాహానికి సన్నాహం అవసరమైనట్టే, విడాకులకు గూడా చట్టరీత్యా ఎంతో కొంత తతంగం జరుగవలసి ఉంటుంది. అక్కడ శుభకార్యానికి సూత్రధారి పురోహితుడైతే, ఇక్కడ పౌరోహిత్యం వకీలుగారిది!

"నా మిత్రుడొకడు బి. యల్. చదివి ఇటీవలే ప్రాక్టీసు ప్రారంభించాడు. అతడితో మాట్లాడమంటారా మేడమ్?" అని అడిగాను.

"ఎలాగు మీరు సెలవుల్లో వూరికి వెళ్తున్నారు గదూ! అతడితో మాట్లాడి రావడం మరచిపోకండి" అంది ప్రమీలాదేవి.

★ ★ ★

ఇరవై రోజుల దసరా సెలవులు ఇట్టే గడచిపోయాయి. మరునాటి ఉదయం స్కూలు తెరువబోతున్నారనగా క్రితంరోజు మధ్యాహ్నం బస్సుకు బయల్దేరాను—బస్సు గమ్యస్థానం చేరుకునేసరికి వృద్ధభానుడు పడమటి కొండచాటున క్రుంకుతూ క్రుంకుతూ ఉన్నాడు.

పెట్టెనూ, పరుపునూ బసలోదించి సరాసరి హెడ్ మిస్ట్రెస్‌గారి ఇంటికి దారితీశాను. చూచి రమ్మంటే కాల్చివచ్చినంతపని చేసినందుకు అభినందనలతోపాటు నాకు కాఫీ కూడా దొరక్కపోదని నమ్మకం.

వీధి మెట్లెక్కాను. వరండా దాటుకున్నాను. హాల్లో ప్రవేశించాను. నిలువునా ముస్తాబై షికారుకో, సినిమాకో వెళ్ళబోతున్న వేషంతో, అర మోడ్పు కన్నులతో ఈజీచేర్‌లో పవ్వళించిన ప్రమీలాదేవి నాకు హాల్లో ప్రత్యక్షమయింది.

"నమస్తే మేడమ్!" అన్నాను.

ఆమె ఉలికిపడి కళ్ళు తెరిచేసింది. నేను పొరబాటు పడలేదనుకుంటాను, ఆమె ముఖం వెలవెలపోయింది.

"ఒంటరిగా కూర్చున్నారేం మేడమ్! పిల్లలేరీ?" అంటూ ఓ కుర్చీని ఆమెకు దగ్గరగా వేసుకున్నాను.

"పిల్లలు తోటలో ఆడుకుంటున్నారు."

ఊళ్ళో విశేషాలేమిటని ఆమె అడుగుతుందని నేను కాసేపు వేచి చూచాను. ఎంతకూ ఆమె పల్లు పలకరించకపోయేసరికి, నేనే అలా ప్రశ్నించ వలసి వచ్చింది.

"విశేషాలా! ఏమున్నాయి? ఏమీ లేవు." ప్రమీలాదేవి నవ్వడానికి ప్రయత్నించింది. ఎంతో ప్రయత్నంమీద పెదవులదాకా ప్రాకివచ్చిన ఆ నవ్వు ఎంత కృత్రిమంగా తయారుకావాలో అంత కృత్రిమంగా తయారై ఆమెలో రేగుతున్న ఆందోళన నాకు సువ్యక్తం కావడానికి మాత్రమే తోడ్పడింది.

మళ్ళీ నేనే సంభాషణకు ఉపక్రమించాను;

"నేను లాయర్ని కలుసుకున్నాను మేడమ్...."

"ఊరుకోం డూరుకోండి." తొట్రుబాటుతో, తడబడుతున్న గొంతుకతో ఆమె నన్ను ఊరుకోమని పరిహరించడం పూర్తికానేలేదు, గదిలో నుంచీ సన్నగా ఈల వినిపించింది!

నేను కుర్చీలో స్తంభించిపోయాను.

'వచ్చెడివాడు ఫల్గునుడు. ఆ శంఖారావం మరొకరిది కాదు. చచ్చి సేయంగల విన్నపాలతో ఇంతదూరం తరుముకొచ్చిన ఆలమందలు మనవి గావు' అనుకుంటూ మ్రాన్పడిపోయిన కౌరవసేన నా మదిలో మెదలుతూంది.

"మరొక విశేష మేమిటంటే ప్రమీలా, మైసూరులో........"

అతడు హాల్లోకి వచ్చి నేనొకణ్ణి కళ్ళబడగానే ప్రసంగం ఆపి "ఇత డెవరు?" అన్నాడు.

"ఈయన కృష్ణమూర్తి అని, మా స్కూల్లో ఆసిస్టె........"

"సర్లే, మరి మైసూరులో బృందావన్ గార్డెన్సున్నాయి ప్రమీలా! హబ్బ, వండర్‌ఫుల్! ఆ లోకంనుంచీ నందనవనం అలాగే క్రిందికి అవతరిం

చిందంటే నమ్ము! ఎందుకూ, కాశ్మీర్‌లో షాలిమార్ ఉద్యానవనాలు ఇంకా బాగుంటాయట! మనమింకా వెళ్ళలేదనుకో. ఈమధ్య ఒక సినిమాలో చూచాను. అన్నట్టు సినిమా అంటే జ్ఞాపకం వచ్చింది, బెంగుళూర్‌లో ఓ థియేటరుంది ప్రమీలా! దానికదే సాటి! ఇంకొక విచిత్రం విన్నావూ, ఆ థియేటర్లో టికెట్టిచ్చేవాళ్ళందరూ ఆడవాళ్ళే! అందరూ ఆంగ్లోయిండియన్లు, నువ్వేమైనా చెప్పు ప్రమీలా, సోయగమంటే వాళ్ళదీ సోయగం! ఎందుకూ, పార్శీలుకూడా బాగానే వుంటారు .."

నా శరీరంపైన తేళ్ళూ జెర్రులూ ప్రాకుతున్నాయి. అంతకుపైన అక్కడ కూచోలేకపోయాను. 'వెళ్ళొస్తాను మేడమ్' అంటూ పైకి లేచి 'వెళ్ళిరండి' అని ఆమె సెలవిచ్చేంతవరకూ ఆలస్యం చేయకుండా బయటికి వచ్చేశాను.

పాకలో పొగ నిండించుకుని, చెంపలవెంట కన్నీరు కార్చుకుంటూ, పొయి మండక అవస్థపడుతున్న అయ్యరు "ఎప్పుడొచ్చారు బాబూ?" అని పలకరించాడు.

"మొదట కాఫీ! తరువాత తీరిగ్గా కుశలప్రశ్నలకు సమాధానం" అన్నాను.

"పచ్చిపాలు, యిప్పుడే పొయ్యిమీద పెట్టాను బాబూ! కాసేపాగాలి" అంటూ అయ్యరు కట్టెలకోసం పెరట్లోకి వెళ్ళాడు.

సమయానికి నా బుర్ర తీవ్రంగా పనిచేసింది. జేబులోనుంచి విడాకులకు సంబంధించిన కాగితాల్ని పైకి తీశాను, శ్రద్ధగా అడుగుతున్నాడుగదా అని నా మిత్రుడు సేకరించి యిచ్చిన ఆ కాగితాల నన్నింటినీ పొయి లోపలికి విసిరాను.

ఒక నిమిషంలో పొయి మండింది. రెండు నిమిషాలకు పాలు కాగింది. మూడో నిమిషానికల్లా అయ్యరు వేడివేడిగా కాఫీ కలిపేశాడు ★